# దీపావళి

దేవరపల్లి మస్తాన్‌రావు...



పురోగామి ప్రచురణలు,

పొన్నూరు.

# దీపావళి

(పద్య, గేయ ఖండకావ్యముల సంపుటి)

రచన :

దేవరపల్లి మస్తాన్ రావు....

అమ్మలకమ్మ జాను తెనుగమ్మ వరాల సరాల మేడలో
కమ్మనలూరు తీయనగు కైతల నామది పొంగిపొర్లు భా
వమ్ముల సంతరించి, విభవమ్ము శుభమ్మును కల్గజూతు
తమ్ముల కీలుబొమ్మల విభమ్మనను్న అనేకులన్ ధరన్.

# స్వీయ విషయము

ప్రజలకు సేవజేముటయె బాధ్యతగా మదినెంచి, పేదలై
రజక కుటుంబ మందున విరాజిలు కోటయ కాదిమాంబకా
త్మజునిగబుట్టి, ఆ తెనుగుధారుణి కారణజన్ములౌ మహా
నుజనుల, సాహితీరణ యశోవిభవాత్ముల చెల్మినందితిన్.

డంబమెరుగని పెద్దకుటుంబమునను
సోదరీ సోదరులుగల్గు సుకృతమంది
ధరణి దేవరపల్లి మస్తానురావు
నాదనర్చితి నిడుబ్రోలు నగరమందు.

- రచయిత



మానవతకు మచ్చుతునక

శ్రీ పి. నరసింహారావు నాయుడు

(రహదార్లు, భవనముల శాఖ ఎక్జిక్యూటివ్, ఇంజినీర్)


జననం : 13-10-1913

## శ్రీ ప్రగడ కోటయ్య

అన్నగారికి

చిన్నతనమ్మునందె పరసీమల వారల పాలనమ్ములో
చిన్నతనమ్ము దోప మునుచేసెడి కొల్వును కాలదన్ని,
సర్వోన్నతమౌ స్వరాజ్య సమరోజ్జ్వల ధారణి దూకియున్న మా
యన్నకు కోటయాభిదున కప్పనముంబొనరింతు గావ్యమున్.

నేతకు నేతగా తెలుగునేలను భారతనేత గాంధీజీ
నీతికి రూపకల్పనము నేర్పుగనోర్పుగంజేసి చూపి, స
ద్భ్రాతగ, బిడ్డగా ప్రజలబాసట నిల్చినవానికీ కృతిన్
బ్రాతిగనిత్తు శ్రీ ప్రగడ వంశ పయోధి శశాంక మూర్తికిన్.



శ్రీ ప్రగడ కోటయ్య

(ఆంధ్రప్రదేశ్ శాసనసభా సభ్యులు)

# ముఖతిలకము

కావ్యస్యాత్మాస ఎవార్థః॥ తథాచాదికవే పురా
క్రౌంచద్వంద్వవియోగోత్థ॥ శ్శోకఃశ్లోకత్వమాగతః॥

ఆదికవియగు వాల్మీకిమహర్షి ప్రకృతి దృశ్యమును; దిలకించి కరుణరసావేశముతో 'మానిషాద' అని నిషేధపూర్వ కముగా శోకమునే శ్లోకము గావించెను, కేవల భావోద్వే గము గలిగి యప్రయత్నముగ సంభవించి స్వయంభూత్వ మందినదే కవిత్వమనుటకు మీది యుదాహరణము చాలును. అందువలన హృదయము పల్లవించిన పలుకుగల పలుకే కావ్యమగునని సాహిత్యదర్పణమున విశ్వనాథుడు "వాక్యం రసాత్మకం కావ్యం" అనియు రసగంగాధరమున జగన్నాథ పండితరాయులు " రమణీయార్థ ప్రతిపాదకశ్శబ్దః కావ్యం" అనియు నుడివిరి. ఈయుద్దండ పండితుల మతానుసారము ఒక వాక్యమైనను లేదా ఒకశబ్దమైనను కావ్యమగును, భావావేశ పూరితములైన భారతీయ ఖండకావ్యములలో జంగమ స్థావరాదులు బాత్రలుగాగ్రహించి తన్మూల మునం దమభావముల దామునమ్మిన ధర్మముల బోధించుచు వచ్చిరి, ఇట్టి సంప్రదాయమునకు శ్రీకారము చుట్టినవాడు మహాకవి కాళిదాసు. దీని నూతగాగొని హంససందేశాదు లెన్నివచ్చినను మూలమును మించలేదు.ఈ మేఘసందేశమునకు హనుమత్సందేశము బీజభూతమని పండితులు కొందఱందురు. ఇక మిక్కుటముగ గొనసాగిన పాశ్చాత్యఖండ కావ్యములలో స్థావరజంగమాది పాత్రలగైకొనక సరాసరి మానవప్రవృత్తులనే యాధారముగాగొని రచన సాగించుటగన్పట్టుచున్నది. ప్రాచ్య పాశ్చాత్య ఖండకృతులలోని యీ భేదము పరిగణంపదగినది.

ప్రధానముగ శృంగార కరుణరసములలోని లఘుకావ్య ములను, ఖండ కావ్యములను ఆచారముగలదు. ఈ దృష్టితో దిలకించిన సంస్కృత వాఙ్మయమునం బెక్కు కావ్యములు గన్పట్టునుగాని వీనినెల్ల ఖండకృతులుగా లెక్కించుట విచార మూలకముగ తోచుచున్నది.

క్రీస్తుశకము 200 సంవత్సరములనుండి 450 సం॥ లోపల నున్నట్లు నిర్ణయింపబడిన శాత

వాహన రాజుల వంశములోని వాడగు హాలుండను మహాకవి "గాథాసప్తసయా" యను ప్రాకృతభాషాగ్రంథమును విరచించెను. దీనినే గాథాసప్త శతి యందురు. దీనికి ప్రపంచ భాషాలన్నింటిలో సముచిత స్థానముగలదు. ఏమహారాణినో ఏమహారాజునో నాయకీ నాయకులుగా గ్రహించి చిలవలు పలవలుగా వర్ణించి గొఱ్ఱె దాటుగా బ్రోపుపూర్వకవులవలెగాక హాలుడు జానపద శృంగారమును దనకావ్యవస్తువుగా గ్రహించి 700 పద్యములలో నేడువందల కథలను గ్రంథించెను. ఇది యపూర్వమైన సృష్టి, ఇతనినుండియే యొకపద్య మొకకావ్యమై విరాజిల్లినదనుటలో విప్రతిపత్తిలేదు. ఖండకావ్య నిర్మాణమున కియ్యది పునాదియు నాందియు ననుట సముచితము. దీని ననుసరించి సంస్కృతములోని పరిమితములైన శతకాదులీకోవకు జెందిన వందురు.

అంధ్ర వాఙ్మయమున నిట్టి ఖండకావ్యములు పురాణ యుగమున నుద్భవింప లేదనవచ్చును. ప్రబంధముగమున సాహితీ సమరాంగణ సార్వభౌమ డగు శ్రీకృష్ణ దేవరాయులు తన ఆముక్తమాల్యదలో మతప్రబోధకములుగా ఖండకృతుల సంఘటించెను వీనికివలయు బీజములనెల్ల నిక్షేపించినను లవి మహాకావ్యంతర్లీనములై మటుమాయమైనవి. ప్రపంచ భాషలలో నగ్రస్థానమందు కొన్న తెనుంగు శతకరాజములీ తోవలో నడయాడినను సంపూర్ణత నందలేదు.

ఇప్పటికవులలో సుప్రసిద్ధులగు శ్రీ జాషువాకవిగారు తమ లఘుకృతులను సంపుటీకరించి ఖండ కావ్యములను పేరవెలయించిరి. మేమెరిగినంతవఱకు సుస్పష్టముగ నీశబ్దమును వాడినవారు వీరేయని తెలియుచున్నది. వీరింజూచి కొందఱు తమ ఖండకృతుల కేవేవో సుందరములైన పేరులుకల్పించిరి. మఱికొందఱు తామురచించిన శీర్షికలలోని యొకదళమును గ్రంథనామముగా నుంచుకొనిరి. ఈ కోవకు చెందినవారే మా మస్తానురావుగారు.

పూర్వగ్రంథములు తద్య పద్యోభయ మయములై ముచ్ఛిధములుగా విభజింపబడినవి, పద్యగేయరచన లిటీవల వచ్చినవి. వీనిలో నిది విశిష్టస్థాన మందుకొనంగలదని మా విశ్వాసము.

ఇందు మొదటి భాగము పద్యఖండము. రెండవ భాగము గేయఖండము. లాక్షణిక వ్యావహారిక భాషలను జతపఱచి ప్రాతకొత్తలకు మేలికలయిక చేకూర్చినట్లు రచయిత యభిప్రాయముగా గు ర్తించితిమి. ఇందుం బద్యభాగమున నిరువది శీర్షికలును గేయభాగమున నిరువది శీర్షికలు సమానముగా నుంచిన తుల్యబల సంపన్నుడగు నీకవి చరితార్థుడాయెను.

విఘ్నేశ్వరపూజతో ప్రారంభించి నమస్కృతులతో గృతిని సంపూర్ణ మొనర్చుట మెచ్చదగియున్నది. కవులెల్లరు సామాన్యముగా దమ సుఖదు:ఖాదుల నెల్లరకు నెఱుకపఱిచి భాగస్వాముల నొనర్చుకొనుటసహజము. ఇందు నొక్కొక్క శీర్షిక కవి హృదయగోళమునుండి వెలి కుబికివచ్చినట్లున్నది.

పదవ శీర్షికలోని :

బుఱ్ఱమీసాల, కిఱ్ఱుచెప్పులనుజూచి
భీతినందెడి దినములు ప్రాతవడియె
కనులనద్దాలు లాల్చీల ఖాదిజూచి
మోసపోయెడిరోజులు మాసిపోయె

అని గళమె త్తి విశ్వసందేశ మునందించెను, గ్రుడ్డిపూజలోని " గుండెతడిలేని నీపూజముండిపోను" లోని వేయికంఠములు నొక్కసారి యెలుగె త్తి జనతా సామ్యవాదము నుద్ఘోషించు పట్టులువిన్న మేన బులకలు గ్రమ్మును, కన్నీటిజాలు- ఆణిముత్యాలు - ఈ రెండు శీర్షిక లీగ్రంథమునకు మకుటాయ మానములు. ప్రతిశీర్షికలోని ప్రతిపద్యము రసగుళికయన నతిశయోక్తిలేదు.

ఇక గేయభాగమున "విప్లవమున కురివేసే సంస్కర ణల సడలించే బ్రదుకులు భారముచేసే గతిమాలిన ఉద్యమాల" ను దిలకించి, "పరుల ప్రేమను నమ్మివారల-నెల్లవేళ పొగడుటెందుకు -లే కట్టునడుం భయమెందుకు" అని గద్దించి" పశుప్రవృత్తియనఅర్థం - తనకుతానుగా మేయుట"అని నిర్వ

చించి శ్రామికజాతిని మేలుకొలిపి కృతజ్ఞతా బుద్ధితో దనజీవిత గమనమునకు ముండ్లు లేని బాటనుజూపిన శ్రీ.పి. నరసింహరావు నాయనిం గారికి నమస్సుమాంజలు లర్పించి చరితార్థుండైన మా దేవరపల్లికవి సంపూర్ణ స్వరూపము నవకవి, నాకలం శీర్షకలలో ప్రతిబింబించుచున్న దని పాఠకులకు దెలియంజేయుచు "కావ్యంతుజాయతేజాతు కస్యచిత్ ప్రతిభావతః" అను భామహుని సంభావనముతో నేకీభవించుచు విరమింతుము.

ఇట్లు

పొన్నూరు కవిరాజు

28-2-68 కొండవీటి వేంకటకవి

నమస్సులు:

పద్యభాగమును పరిష్కరించిన

శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులుగారికీ

గేయభాగమును పరిశీలించిన

శ్రీచిన్నము రామయ్యగారికీ

ముఖతిలకము ననుగ్రహించిన

శ్రీకొండవీటి ఎరేకటకవిగారికి

కృతజ్ఞతలు:

నా ఈస్థితికి చేయూతనిచ్చిన పెద్దలు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యులు

శ్రీ పాములపాటి అంకినీడుప్రసాదరావుగారికీ

అఖిలభారత రజకసంఘఅధ్యక్షులు

శ్రీ వేమవరపు వెంకటేశ్వర్లుగారికీ

గుంటూరు పత్రికాసంపాదుకులు

శ్రీజమిలి నమ్మాళ్వారుగారికీ

మానవతావాది

కీర్తిశేషులు ఆవుల గోపాలకృష్ణమూర్తిగారికీ

ధన్యవాదములు:

ఈకావ్యముద్రణకు ప్రోత్సహించినమిత్రుడు

శ్రీ కె.వి. సుబ్బారావుగారికీ

ముద్దుగా - ముచ్చటగా ముద్రించి ఇచ్చిన

శ్రీ విజయవాణి ప్రింటర్స్, ఒంగోలువారికీ

## దివ్య దీప్తులు:

సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితంసంగతి, 1948 లో నిడుబ్రోలు ఎడ్వరుబోర్డు హైస్కూలులో స్కూలుఫైనలు చదువుతున్నాను, వ య స్సు 16 సంవత్సరాలు. బానిసాంధకార బంధురమునుండి భరతమాత బయటపడి అప్పటికి సంవత్సరమైనది. ఆమె స్వీయతేజస్సుతో నవ్యంగా ప్రకాశిస్తున్నది. ఆదివ్యదీప్తులతో పునీతమైన నా లేతమనస్సు ప్రపంచములోని ప్రతివిషయాన్నీ పరిశీలించ ప్రారంభించినది.

శ్రీ కొత్తపల్లి వెంకటరత్నంగారు మాకు తెలుగు అధ్యాపకులు, పరీక్షకవసరమైన పద్యలక్షణములు, గణవిభజన, యతి, ప్రాసస్థానములను పరిచయంచేశారు. ఆయన గద్య, పద్యములను పెద్దకంఠంతో, ఉద్రేకపూరితంగా చదివేవారు. మధ్యలో సుభాష్‌చంద్రబోసు మొదలగు స్వాతంత్ర్యయోధుల గాథలుచెప్పేవారు. నాలో అప్పుడప్పుడే అంకురిస్తున్న వాడిభావములకు వేడితగిలి కవితగా పొంగివచ్చినది.

ఇవ్విధముగా పరిచయమైన కవితాకుమారి నన్ను వెన్నుతట్టి, కనులు తెరిపించి వివిధ దృశ్యములను చూపించి హృదయ స్పందనము కలిగించినది. ప్రజాస్వామికమునకు మూలకందములైన ప్రజాసంఘములు-ముఖ్యముగా వృత్తిసంఘములు ఆంధ్రదేశమున తామర తంపరగా తలలెత్తినవి. అవి నన్నెంతగానో ఆకర్షించినవి - ఆహ్వానించినవి.

ఆంధ్రజాతిని ప్రగతి మార్గమున పురోగమింపజేయు మహదాశయములతో కొంగ్రొత్తవార, మాసపత్రికలెన్నో ఆవిర్భవించినవి. నా భావావేశమున కవి ఆలంబనమైనవి. వాటిలో కొన్నిటి మనుగడకు నేను బాసట నైతిని. అందులో నా పద్య, గేయ భాగములను ప్రచురించిన "రజక పత్రిక, గుంటూరు పత్రిక, వాసవి, యుగవాణి, విశ్వవాణి, నవ్యభారతి, రజకజ్యోతి, తెలుగు దేశం, నగారా" పత్రికాధిపతులు - నాటికలు, కథానికలు విమర్శలు, వ్యాసములు మొదలగు గద్యభాగములను ప్రకటించిన " ప్రజావాణి, ఆంధ్రనాయీబ్రాహ్మణ, జయభేరి రాడికల్ హ్యూమనిస్ట్, నేత, చేనేత, శాంతిదూత, తెలుగు స్వతంత్ర, తెలుగుసీమ, " పత్రికాధిపతులు - ప్రకటనలను వెలువరించిన " ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, దినపత్రికా

నిర్వాహకులు- వీరంతా రచనా వ్యాసంగమున నాకుగల ఉత్సాహమునకు అంతో, ఇంతో ప్రోత్సాహమిచ్చిన వారే, వీరందరికీ కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

ప్రారంభమున " అభినవ తిక్కన " గారి "రాష్ట్రగానము" లోని మాధుర్యము,"కరుణశ్రీ" గారి " ఉదయశ్రీ" లోని లాలిత్యము నన్ను చవులూరించినవి. తర్వాత చదివినవానిలో " శ్రీశ్రీ" గారి"మహాప్రస్థానము", " విశ్వం" గారి " పెన్నేటి పాట", "గురజాడ",వారి " ముత్యాలసరాలు", " కవిరాజు" గారి "గీతాలు- గేయాలు", నండూరి సుబ్బారావుగారి 'యెంకి పాటలు" నన్ను గిలిగింత పెట్టినవి. వీరితో పాటు ఇంకా నా మనస్సు నాకొట్టుకున్న ప్రతి ఆధునికకవీ నా రచనా సౌలభ్యమునకు దోహద మిచ్చినవారే, వీరందరికీ నా నమోవాకములు.

రెండు దశాబ్దములుగా నా జీవితంలో అప్పుడప్పుడూ పొంగివచ్చి, అక్కడక్కడా ముద్రింప బడిన భావావేశ కవితా ఖండముల చేర్చి, అందినంతవరకిపుడు పుస్తకముగా కూర్చి, దీపావళి పేరుతోరసజ్ఞులైన పాఠకుల కరకమలము లందుంచుతున్నాను. సహృదయంతో చదువగోరెదను.

అద్దంకి మీ
5-3-1968 మస్తాన్‌రావు

స్వామ్యములు: ప్రథమ
ముద్రణ
కృతికర్తవి. 1000 ప్రతులు

కీలక ఉగాది - మార్చి 1968

ప్రతులకు:
శ్రీమతి దేవరపల్లి వేంకట సుబ్బమ్మా మస్తాన్ రావు.
నిడు బ్రోలు - గుంటూరు జిల్లా

మూల్యం : రూపాయిన్నర

ముద్రణ:
శ్రీ విజయవాణి ప్రింటర్స్ - ఒంగూలు

# ప్రథమ శ్రేణి

# పద్యములు

దీపములు

విఘ్నేశ్వర పూజ

రాగసుందరి

బాలవితంతువు

రజకనారి

దీపావళి

ఉగాది

భరతమాత

గాంధితాత

పండిత జవ్హారు

సందేశము

నవవసంతము

గ్రుడ్డిపూజ

''వోటు'' హక్కు

కన్నీటిజాలు

ఆణిముత్యాలు

తీరనికోర్కెలు

నిరుద్యోగి

అరుణహస్తము

ఆలాపన

వేకువ అలుక

## విఘ్నేశ్వర పూజ

విఘ్నములన్న నీకుంగడు వేడుక యంచును విశ్వమందు నిన్
విఘ్నధవుండ వందురు వివేకులుకొందఱు వింతగొల్ప నో
విఘ్నపతీ! జగాన నిను వేడక యేపని జేయబోరు - ని
ర్విఘ్నముగా మదీయకృతి వెల్వడ జల్లని చూపు చూడరా!

త్రిజగముల నుద్ధరించెడిదేవి జనని
పార్వతిబాయి గారాబు పట్టివై
నీదుకడగంటి చూపులు నిర్మలములు
అరటి పండిత్తు నాపని కడ్డురాకు

కుడుము లుండాళ్లు తెగతిని గొంతువఱకు
తిండిబోతను బిరుదు మగండవైన
బొజ్జబాబయ్య! నీపదంబులను గొల్తు
మూషికమునెక్కి చనుదెంచి ముక్తినిమ్ము

"గుంటూరుపత్రిక" 15-09-1953
"వాసవి" 15-09-1953

## రాగ సుందరి

జలజల యేటవాలుగను జాలులువాఱు ఝరీ నినాదమో?
కిలకిల పంచమశ్రుతిని గీలితమౌ పికరాజి రాగమో?
తళతళలాడు వీణియల తంతుల వెల్వడు దివ్యగానమో?
తెలియగజెప్ప లేరెవరు తేలికగా నవముగ్ధమోహినీ!

ముగ్ధమోహిని! నీలేత మోవియందు
దళుకు లీనెడు చెక్కుటద్దాల పైని
పసిడి నీడల సొరులే భ్రమయజేసి
వలపులొలికించె నేడు నాతలపులందు

రాలుగరగును నీరాగరసము సోకి
పరుగులిడుపాము నిల్చు నీపాటవినగ
గంగ కదలాడకుండు నీగానమునకు
వలపు బంటల బండించు వయసునీది

"శ్రామికసింహము" నుండి 1951
సరస సంగీత మృదుగళ స్వాదుచిత్త
మత్తకోకిల యనదగు మగువవీవు
సహజ సౌందర్యసంపద జాలువాఱు
ముఖవికాస మనోహర మూర్తివీవు

అంగన! పాటబాడి హృదయమ్ముున గమ్మని రాగలేఖినిన్
బంగరుపూత బూసితివి, భవ్యమనోహర దివ్యసీమలన్
పొంగులు వాఱియున్ వలపుబూవులు పూచెను ప్రేమవల్లరిన్
జెంగటజేరి త్రుంచుటకు జేతులు వేగమ పర్వులెత్తెడిన్

రాగముదీసి తీవు-అనురాగ  తరంగమరీచి మాలికల్
సాగగజేసి తీవుమనసార నినుంగన నంతరాత్మనే
బాగుగమార్చి తీవు-బహు భంగులగూర్చిన సూక్తులెవ్వియో
ఆగక పొంగివచ్చు మధురాంగన! వీనులవిప్పి విన్నచో

పాటలబాడి యా పరమపావన భారతభాగ్యవీణియున్
మీటలు దరంగమాలికలు మిన్నునమ్రోగె  జయంబటంచు; నీ
నీటు గళంబులోని కమనీయ మహోదయ కాంతిపుంజముల్
బాటల దిద్దితీర్చినవి భారతమాత వరాలగద్దెకున్.

కులుకులరాణి! నీకుసుమకోమల గాత్రపుజిల్గు వెల్గులుం
గలచెను నాదుగుండె నొక కావ్యసుధారస ధారవోలె, నీ
పలుకొక మేలుగొల్పుగ ప్రపంచము లాలన చేసెనమ్మ! వీ
నుల నదియొగ్గివిన్నది వినూత్న శుభోదయదాయి యైసదా!

సదయుల నెల్లం బ్రోవగల జాబిలివెన్నెల లీనుచుండ నా
హృదయము పొంగిపొర్లి  ప్రవహించెడి ప్రేమంపైక భావముల్
మృదుమధురంపు దీవలయి మించులమించి పరిభ్రమింప నీ
పదముల నాలపింతు జనిభాగ్యము ధన్యముగాదలోదరీ!

యుగవాణి"    5-7-1952
గుంటూరు పత్రిక"    1-8-1953
వాసవి"    1-8-1953

బాల వితంతువు

చిట్టిగౌనులక్రింద బొట్టి చల్లడముంచి
బడికిం బర్వెత్తు లేబ్రాయమందు
బాలిక నేనన్న భావమ్ము తెలియక
బాలురతో నాడు కాలమందు
జిఋతిండియే తన జీవితంబనియెంచి
చిందు నేయుచు గోలచేయువేళ
బంగారు తళ్కొత్తు పాల్గారు చెక్కిళ్ళ
చదురు కెక్కనియట్టి సమయమందు

జేసిపెండిలి నీగొంతు గోసినారు
సిగ్గుదెలియని నీకు నాసిగ్గులేని
పెండ్లి పెద్దలయందు గన్పింపగలవి
బొజ్జలేగాని శూన్యముల్ బుజ్జలకట!

పెండిలినాడు బుగ్గపయంబెట్టిన కాటుకమాయలేదు-పూ
దండలు వాడలేదు - నవ దంపతులిద్దరు ముద్దుముద్దుగా
బండువుగా భ్రమించు పువుబంతులయాటలు మాయలేదు-మీ
యండననిల్చి యంగనలు హారతులిచ్చిన పాటవిన్నడున్

భర్త గతియించెనన్న విభ్రాంతిలేక
భావి జీవితముంగూర్చి బాధలేక
గడపి తీవమ్మ కాలమీ గడియ వరకు
నెట్లుగడపెదో దినముల నింకమీద

జవ్వనము తొంగిచూచు నీ సొరుజూచి
హాస మొలికించు చుండె నీ యధర మిపుడు
"అందములరాణి" యని లోకులంతబలుక
గోరికలు లోన గువ్వకోల్కొనియె నమ్మ!

ఉబికివచ్చెడి నీలోని యూహలెల్ల
నుడిగి పోవగజేయు నీచెడుగు జగతి
అడవిగాచిన వెన్నెల యయ్యెబ్రతుకు
జలధిబడు వానయయ్యె నీజవ్వనమ్ము

ముండతనమ్ము నీపయినమోపిరి బాపురె! నిన్నుజూచి యు
ద్దండులు బుద్ధిహీనులయి దారితొలంగిరి; యంతబోక పా
షండులు, ర క్తమాంసములు చచ్చిననొచ్చిన నీవికాసమున్
దండనం జేయబూనిరి కదా! యమకింకరులట్లు సోదరీ!
కాటుక కన్నుదామరల  గాలువలై ప్రవహించువేడి క
న్నీటి కణంబులందుడువ నేరరు సుంతయునెవ్వరైన నిన్
జీటికి మాటికిం గసరి చీకొనరించియు బూచిపుల్లతో
సాటిగజూ చుచుండెదరు సా త్త్వికతత్త్వమో? రాక్షసత్వమో!

"యుగవాణి" 5-5-1952
" గుంటూరుపత్రిక" 15-8-1953
"వాసవి"    15-8-1953

## రజక నారి

చిఱునగవుల్ వెలార్చు ముఖసీమ విరాజిలు మంగళాకృతుల్
గరువము లేకయే పసిడి కాంతులుచిమ్ము శరీరమివ్విధం
గఱకులు వాఱుచున్న మదిగానగరాదు విచారరేఖ - నీ
సరి సరితూగలేని నెఱజవ్వన మాహుతియయ్యె నెండకున్

పరజన పారిశుధ్య మెదబాటిలజేయగ జి త్తశుద్ధితో
జరచర పోయెదో రజక చంద్రముఖీ! పెరవారి యిండ్లకున్
గొరకొరజూచు చుంద్రునినుగూళలు గర్వముచిందు కన్నులం
బొరల ధరించినట్టి విషపూరిత సర్పములౌట నెంతయు

ప్రసవము గాంచినట్టి పసిపాపల పొత్తుల శుద్ధిజేయ నీ
కుసుమ కరమ్ములన్ మురికిగుడ్డలనంటెడు తల్లివైన ని
" న్న సె!, ఒసె"! యంచు నెంతోపరిహాసము మీఱగ
బల్కరించునా
పసరముకున్నెబుద్ధి? తన భామిని నట్టుల బిల్వనొప్పునే?

దినకరుతోడ లేచియు బతిన్ సుతులంగొని రేవు కేగ నో
వనజముఖీ! జగమ్మునం గృపారసహీనుల మేడలెక్కియున్
వినయ విధేయతల్, మివుల భీతిబెనంగొన " బాబు గుడ్డ లి
మ్మ" నుచును దేబెరించెదవె? యమ్మకు మించినయమ్మ వీవెకా!

గుబురు చెట్టునం గట్టిన గూటియందు
బిల్లలం గుల్కు చున్నది పిచుకగూడ
కలచు చుండెడి మండు టెండలకు నైన
నీడజేరగ నోచవో నీలవేణి!

పగలు పడరాని యిడుమలం బడియు నీవు
నీటు విడనాడి పిడికెడు కూటికొఱకు
బుట్టగైకొని వీధులం బోదువేల?
భిక్షమా? యిదిశిక్షయా? బిసరుహాక్షి!

"రజకపత్రి" 5-11-1951
" రజకజ్యోతి" 10-1-1963

దీపావళి

అంచిత భక్తితోబతి పదాబ్జములన్ వినుతించి - నారి సా
రించి-దురాత్ము నొక్కని హరించి- నవోదయ శాంతి నోలలా
డించి-యఖండకీర్తిని గడించిన సత్యధరా తలాన గ్రీ
డించి కళాపథమ్ముల ఘటించిన పండువు నేడు వచ్చెగా!

భువిబడ బాగ్ని జేసిన యపూర్వ పరాక్రమ విక్రమోగ్ర శా
త్రవు తల త్రెళ్ల, శాంత్యుదయ ధాత్రి హసింపగ, హైందవాంగనల్
భవనపుబ్రాంగణమ్ముల నభమ్మురు కాంతి వహించు దీపికా
నవమణి మాలతో జగతి నవ్య కరమ్ముల వెల్గ జేసిరౌ

భావ పరంపరావళి నపారముదం బొనరించు దివ్య దీ
పావళి వింతవింతల టపాకురవల్ చెలరేగు గాంతి ర
త్నావళి- యాంధ్రమాత విజయమ్మును గాంచిన వీరకంఠ హా
రావళి - యిద్ది భారతధరావళి బొల్చినపండువౌ సుమా!

ఈ లలితప్రభారుచుల నేదియొ చెప్పుచునుండె గాంతి దీ
పాలు హృందంత రాళముల బ్రాకుచు "వచ్చెస్వరాష్ట్రం మాంధ్ర ధీ
రాళికి సుస్థిరమ్ముగ సురాజ్యముగా వెలుగొందు" నంచుగా
బోలును, గుండియల్ కరగిపోయి - స్రవించెనుహర్ష బాష్పముల్

" గుంటూరుపత్రిక" 7-11-1953

(ఆంధ్రరాష్ట్రోదయమైన తదుపరి తొలిగావచ్చిన దీపావళికి వ్రాయబడినవి. 1956 నవంబరు 1న దీపావళి శుభాగమనముతో ఆంధ్రప్రదేశ్ అవతరించినది.)

ఉగాది

తెలుగు వెలుగుల విరజిమ్ము దివ్యకాంతి
తెలుగు బలుకుల దొలికించు దివ్యవాణి
తెలుగు జాతికి మోదమ్ము గొలుపురాణి

కదలివచ్చెను క్రొత్త యుగాదిలక్ష్మి

పాడి పంటల గురియించు పాలవెల్లి
కలిమి చెలుముల గులికించు కల్పవల్లి
భవ్య చరితను జేకూర్చు భాగ్యవల్లి
రమ్మ! దయచేయుమమ్మ! మారంగవల్లి!

వచ్చె నయ్యేదె విజయ సంవత్సరాది
తెచ్చెసిరులను ప్రజలకు నిచ్చుకొఱకు!
మచ్ఛకంటులు విరజాజి మాలలంది
చేరి పూజింత్రు విజయలక్ష్మిని సభక్తి

పొట్టిరామన్న చేసిన గట్టి తపము
ధన్యతం గూర్చుకొన్న యాంధ్రప్రదేశ
రాజ్య రమకు సమస్త వరమ్ములిచ్చి
స్థిరము గూర్పుము విజయలక్ష్మీ సవిత్రి!

"గుంటూరుపత్రిక" 16-3-1953

(అమరజ్యోతి పొట్టి శ్రీ రా ము లు పూర్ణాహుతి పొందిన ఫలితముగ పార్లమెంటులో ప్రత్యేకాంధ్ర రాష్ట్రావతరణము సత్వరము జరుగగలదని

ప్రకటించబడిన యనంతరము తొలి ఉగాది
విజయ సంవత్సరాది సందర్భమున ప్రకటితము)

భరత మాత

ఆకాశ పథమున కంటియున్న హిమాల
యమ్ము స్వీయోత్తమాంగమ్ము కాగ్ర
గంగాది పుణ్యాపగా ప్రవాహమ్ములు
మురువు కొల్పుచునుండు కురులుగాగ
బంగారు పొంగారు వనలక్ష్మి కటిసీమ
వ్రేలాడు నవరత్న మాల కాగ
మూడు ప్రక్కలనున్న ముత్యాల జలనిధుల్
ముంగాళ్ళ జీరాడు చెంగులనగ

పాల నిచ్చెడి గోవులు పసిడి పండు
పొలములును నీకు వెలలేని బలముగాగ
నలరుతల్లివి నీ ముప్పదాఱుకోట్ల
బలగముల దిద్దుకొనవమ్మ! భరతమాత!
"గుంటూరుపత్రిక" 24-1-1953

(భారతదేశం స్వతంత్ర రాజ్యమైనప్పటి రచన-అప్పటిమనదేశ జనాభా 36 కోట్లుగా గ్రహించనగును.)

## గాంధి తాత

నడిపించితీవు నీయడుగు జాడలయందు
దక్షిణాఫ్రిక భారత ప్రవరుల
గదలించితీవు నీ కఠినోపవాసాల
నాంగిలేయుల మాన సాంతరముల
కలిగించితీవు నీ పలుకులం దొలికించి
చంటి బిడ్డకును స్వేచ్ఛాపిపాస
దుమికించితీవు నీ దుందుభి మ్రోగించి
కదనభూమికి వేయిగతులు బ్రజల

స్వేచ్ఛయేలేక కుమిలెడి జీవితాల
మేలుకొల్పిన విశ్వవైతాళి కుండవు
యుగ యుగంబుల నీకీర్తి జగము నుందు
గ్రమ్ముకొనినిల్చుగాత శ్రీగాంధితాత!
"గుంటూరు పత్రిక" 31-1-1953 2-10-1962

(గాంధి వర్ధంతి, గాంధి జయంతి ప్రత్యేక సంచికలందు ప్రకటితము.)

పండిత జవ్హారు

గాంధి మహాత్ముని ఘన ధర్మ రథమును
పట్టి ముందుకునెట్టు గట్టివాడ!
సమతా ప్రభావమ్ము చాటించి, పాటించి
ప్రజల నాకర్షించు పండితుండ!

ప్రాక్పశ్చిమంబుల వాక్సుధా ధారలో
జలక మాడించు విజ్ఞానధనుడ!
రాజ్యాంగ ధర్మ మర్మముల రచ్చలకీడ్చు
వేత్తగా వెలుగొందు వీరవరుడ!

భరతమాతకు గారాబు పట్టివగుచు
జాటితివి శ క్తి జాతీయ సమర మందు
సత్యవర్తన! శాంతి సంస్థాపనార్య!
ఆసియాజ్యోతి! జోహారు లందికొమ్ము!

ధన్యులాంధ్రులు భరత ప్రధాని వీవ
యాంధ్ర రాష్ట్రావ తరణమ్ము నాచరింప
సుగతి వచ్చితి కర్నూలు నగరమునకు
నాంధ్రులందించు కైమోడ్పు లందికొనుచు.
(గుంటూరు పత్రిక "1-10-1953
ఆంధ్ర రాష్ట్రోదయ ప్రత్యేక సంచిక.)

"నవ్య భారతి"

విశ్వవాణి"        1-12-1958

సందేశము

నిన్నటి దాక గాక మరి నేటికిగూడ నొక్కొక్కచోట ఆ
పన్న విహీన మానవ  భుజంబుల నెక్కుచు స్వారిచేయు సం
పన్నుల, స్వార్థచిత్తుల, కుపాదుల దుర్భర దుష్ప్రవర్త నం
బన్నది సాగుచుండెనిక నాయుధ మూనుడు వానినాపగన్

కన్నులు లేని పాలకుల కాలముమార్ప్రబతిజ్ఞబూని " మా
కున్నది సర్వహక్కు భరతోర్వి" నటంచు నినాద గీతికల్
మిన్నునుముట్ట పేదలగు మిత్రులు సన్నని కండలుబ్బగా
గ్రన్ననబాడుడీ! జయము గల్లినదాక  భయంబు వీడుచున్

కాలము మాఱుచుండె - కలికాలపు రీతులు బ్రాకిపోయె-బో
గాలము దాపురించె గులగౌరవముల్ తమ సొత్తులంచు మీ
సాలను దువ్వు దుష్టులకు శక్తి యొకింతయు నేడు లేదు - కా
రాలను నూరువారల శిరమ్ములు వంగు దినాలు వచ్చెడిన్

ఆకలిగొన్న సింగముల నట్టుల హింసల  పాలుసేయ న
ఙ్ఞాకటి వహ్నికిన్ సమిధ, లాజ్యమునున్ సడియెండ, గాలితో
డై కదలించు టేయగు ;  క్షుధార్తుల  నూరక నూరడించుటల్
సాకులుచెప్పి పంచుటలు సాగవు స్వార్థపరాళి కింకపై

రంగులుమార్చి నేడు రణరంగమునన్ వడిదూకి " ఓట్ల " నే
బొంగర  పాటలాడ  మన పొంతకు జేరెడి   నాయకోత్తముల్

హంగులు జూపుచుందురు మహాత్ముల శిష్యులమంచు నెందఱో
దొంగలు వచ్చుచుంద్రు ప్రజదోయగ "జాగ్రత" మాన గావలెన్
బుఱ్ఱ మీసాల, గిఱ్ఱుచెప్పులను జూచి
భీతి జెందెడి దినములు పాతవడియె
కనుల నద్దాలు, లాల్చీల ఖాదిజూచి
మోసపోయెడి రోజులు మాసిపోయె
లక్షలు చెప్పవచ్చు, బదిలక్షలు వ్రాయగ వచ్చుగాని యం
దక్షరమైనగాని వృథయై చనుదేరక కార్య రూపమున
దక్షత నిచ్చువాడె కడు దక్షుడు - అన్య "పక్షివాగుడుల్"
కుక్షిని నింప " లేత సొరకోతలు" గాక ఫలమ్ములెట్లగున్

("రజక పత్రిక " 5-2-1952)

## నవ వసంతము

చైత్రమాసమువచ్చె విచిత్ర గతుల
ఆకురాల్చిన చెట్లన్ని రేకువేయ
లేత యాకుల నలరారి పూత పూచి
పోతెరించెనొ యన నొప్పె భూతలమున

పూచి వనదేవి పిండార బోసినట్లు
చూచు వారికి గనుసన్న తోచునట్లు
పిలుచు మనములు చిలుకగ బ్రియముతోడ

గొలుసు రసవంతు లద్దేవి కూర్మితోడ

కోయిలజంట పిల్చునట "కూ" యని తీయని కోర్కు లెవ్వియో
పూయగ - వాని విన్నం బరిపూర్ణములై వికసించు చుండు లే
బ్రాయపు వన్నె చిన్నియలె, భ్రాంతి జనించుచు నుండు నొక్కచో
నూయెలలూగు మానసము లూహకతీతము నాటిశోభయున్

లాలసతనాడు జంటను పూలతోట
పారవశ్యముం జెందించు బరిమళించి
ప్రొద్దుపోవక వనములో సద్దు సేయు
రసికులకు నొక్క సందేశ మొసగుచుండు

ఆశతీవలు తెగియు నిరాశతోడ
నది యిదియు దోచబోక సాయంత నమున
దిగులుబొగలుగ వనములో దిరుగుచున్న
నన్నుగాంచి "వసంతమ్ము" నవ్వదొడగె

"ఆశచిగుర్చు నెల్లపుడు, నంతములేదు  సుఖాని కీధరన్;
నాశము కాకుమెల్లపుడు నాశమె నిన్ను వరించెనంచు; లో
కేశులు నీకు, నాకు గ్రిమికీటకపాళికి, రాతి కేనియున్
ఆశలు  గొల్పుచుందురు, నిరాశ వహింపకు జీవితంబునన్

బ్రతికి నన్నాళ్లు సుఖమును బడయబోము
వెతలు తప్పవు కొన్నాళ్లు క్షితితలమున
గష్టసుఖములు కావటి కడవలనెడి

నీతిలోకోక్తి నార్యులు  నేర్పలేదె?"

కనుచు నిశ్చేష్టితుండనై విసిననాకు
హృదయవీణియ తంతృలు కదలసాగె
వాడిపోయిన జీవిత పాదపమ్ము
పూయసాగియు గాయలు గాయసాగె

ప్రకృతిలో నిట్టి పాఠాల బఠనచేయ
వికృతి, సవికారముల మది వెలయనీక
సుకృతి గలుగగ జేయు విశుద్ధమతికి
గురువు దైవమ్ము ప్రాకృతి నరయునిజము

"యుగవాణి" 5-4-1952
(వికృతినామ వత్సర వసంతమునవిరచితము)

గ్రుడ్డి పూజ

"గణగణ" యటంచు గుడిలోని గంటలెల్ల
మ్రోగుచున్నవి భ క్తులు మ్రొక్కుచుండ
"టంగుటంగు" న గడియారము గనగ
గొట్టె పంద్రెండు గంటలు పట్టిపట్టి

పూజలకు మున్నతిన్న దధ్యోదనమ్ము
లరగ భక్తులు మంతోక్తులాడు చుండ

నందములం జిమ్ము బొమ్మ కభిముఖముగ
బూల బుక్కాయి పూజారి పోయుచుండె
అంతలో నొక్కగ్రుడ్డి బాలెంతరాలు
బొంతలోనుండు బొచ్చను పూనిపట్టి
తలుపుప్రక్కగ గోడను తడివిచూచి
నిలచివలికె విషాదమ్ము మొలకలెత్త-

"సిరి వరించిన దశగల జీవులార!
దానముననను ధర్మముంజేయు దాతలార!
బిడ్డలం బెక్కురంగన్న దొడ్డెలార!
గుడ్డిదానికి నొకముద్ద గూర్పుడయ్య!

నిన్న ప్రొద్దుటనుండి నాకన్న నలుసు
కొక్క మెతుకైన నాకించకుంటి నకట!
యేడ్చి యేడిచి శొషిల్లెనేమొ నేడు
కదలికయలేక పడియుండె గనులుమూసి"

అని యలమటించు నా దీనురాలి గద్గ
దారవమ్మును వినుచు సుంతైన గరుణ
జూపనేరక యట కొక్క పాపిచేత
కఱ్ఱగొనివచ్చి యదలించి గదిమెనిట్లు

" ముష్టి ముండవు కన్నులు మూత వడెనె
వీపుచిట్లును వెంటనే వెడలకున్న
ధూప నైవేద్యముల హారతులను గూడ

ఇయ్యు లేదింతవఱకు మే మీశ్వరునకు"

అంచునొక కఱ్ఱ మెడపైని నట్టెవెట్టి
"పద" యనుచు నెట్ట గూలెను పళ్లురాల
ఆమె పడినంత నర్భకుండఱచి యఱచి
శాశ్వతమ్ముగ గనుమూసె క్షణమునందె,

ఆంత నాతల్లి వణకెడు గొంతువిప్పి
యేడ్చుచుం గంటినీటితో నిట్లుపల్కె
" గదలి చలియించు జీవాత్మ గాంచలేని
యల్పులగు మీరు పరమాత్మ నరయగలరె?

గుండె తడిలేని మీపూజ మండిపోను
పాలు, ఫలములు, వడపప్పు బట్టితెచ్చి
నోరు లేనట్టి జాతికి గోరికోరి
పెట్ట జూతురు బ్రతిమాలి పెద్దలార!"

" యుగవాణి" 5-6-1952

''వోటు'' హక్కు

వేవేలు విద్యార్థి బృందాలు బడిమాని
లాటి పోటులుదిన్న "లాభ" మనగం
జిక్కని రక్తము జిమ్మించి యేరులు
పాఱించి పండించు "పంట" యనగ

రాలిన శల్యాలు, కాలిన బూడిద
సమకూర్చి కట్టిన "సౌధ" మనగ
గాంధి, జహ్వారు లాదిగాగల్గు పూజ్యులు
సలిపిన సత్తప: "ఫల" మనంగ

నమల భారతవరుల "చిహ్నము" లనంగ
జిక్కె జేతికి మన "జన్మహక్కు" వోటు;
తప్పుదారుల నిడబోక తం(డులార!
విలువ నరసియు నద్దాని వేయుడయ్య!!

సత్యాత్ముడగు గాంధి శాంతి యుద్ధమ్ములో
సత్యా(గహోద్యమ"సార" మనగ
"దేశాయి" "కస్తూరి" "దేశభ క్తు" ల నాటి
జై లు పోరాటంపు "జయ" మనంగ

సింహ రూపులు భగత్ సింగ్వాది యోధులు
తనువిచ్చి గై కొన్న "ధన" మనంగ
కార్మికుల్ కర్షకుల్ కఠిన దీక్షలదాల్చి
పస్తులు పడికొన్న "వస్తు" వనగ

పారతం(త్య పిశాచమ్ము పై కొనంగ
చించి చెండాడు వీరుల "చిహ్న" మనగ
సర్వజనులకు సమమైన "సంపద" నగ
నొప్పుచున్నట్టి వోటులోగొప్ప నరసి
సజ్జనులకిచ్చి గెల్పించు సదయ హృదయ!

అష్ట కష్టాలకోర్చియు నఱువదేండ్లు
పూర్తిఫలముగ "వోటు" ను బొందినాము
విసము గూలికి దాగెడి వెఱ్ఱివోలె
ధనమునకు దాని బలినీయదగదు తగదు.

నక్కజిత్తుల నేర్చిన టక్కరులును
పెక్కువిధముల నిను జిక్కుపెట్ట నెంచి
గాలమున మీలలాగెడి జాలరివలె
చెవుల కింపగు కబురులు చెప్పుచుంద్రు

వందలు చేతబట్టి పదివందలసారులు నీదుచుట్టు వా
రెందుకు దిర్గుచుండిరొ గ్రహింపుము నీతినివీటిబుచ్చి, నిన్
బందగమార్చియున్, సకలభంగుల గౌరవమిచ్చియున్, మహా
నందముమీర బిల్చుటయు నాశముచేయుటకే తలంపుమా!

వినుము కబురులు, వినినంతవేగపడక
కొంచె మాలోచనమ్ముగావించి, ప్రజకు
మంచినెవ్వరు చేతురో కాంచి కాంచి
యెంచికొను మనప్రతినిధి యంచు నతని.

" రజకపత్రిక" 05-02-1952
"గుంటూరు పత్రిక" 10-2-196

(స్వతంత్ర భారతంలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల ప్రచార భారతి)

కన్నీటి జాలు

ఆదికాలపు నిగమాగ మమ్ములజూడ
నధికార మందఱ కబ్బియుండె
పౌరాణిక గ్రంధవారంబు గననుండె
వర్ణాంతర వివాహ నిర్ణయమ్ము
ఇతిహాస పుస్తక వ్రతతిలో గలదు నె
వ్వరివృత్తి వారికి వరమటంచు
నెఱిగి స్వధర్మమ్ము నెర వేర్చుటయ గొప్ప
యని తెల్పినారు బుద్ధాదిమునులు

జాతి మత భేదములతోడి జబ్బులెగసి
జాఱిపోయెను భారతజాతి నేడు
నేటి రోజులజూచి కన్నీటి నిడక
నాటి రోజులకై మీరు పాటుపడుడు!

కలదుగా! భారతఖండ వా స్తవ్యులం
దఱునైక్య మొప్పగ దిరుగుదినము
కలదుగా! మనదేశ కులజులందఱుగూడి
పగతురం జీల్చిన పర్వదినము
కలదుగా! హైందవ ఘనులందఱొక పంక్తి
బోనమ్ము సేసిన పుణ్యదినము
కలదుగా! యిచటి జాతుల వారికెల్లయు

## వర్ణబేధము లేక వరలుదినము

కలదు కలదుగదా! మన గడ్డయందు
సాంఘిక వివాదములు లేని సత్యదినము
నేటి రోజులజూచి కన్నీటి నిడక
నాటి రోజులకై మీరు పాటుపడుడు!

1951

## ఆణి ముత్యాలు

ఆదికావ్యంబైన యారామ చరితమ్ము
గూర్చిన వాల్మీకి కులమదేమి?
గీతార్థసారమ్ముగ్రీడికి దావించు
వసుదేవ నందను వంశమెద్ది?
దాన ధర్మంబులం దాతనాపేర్గన్న
కర్ణ మహావీరు వర్ణమేమి?
లలిత పదమ్ములం దొలికించి రామాయ
ణమ్ము గూరిచిన మొల్లమ్మ యెవరు?

గురుని మదినిల్పి చక్కని గురినినేర్చి
ఘనుడయిన యేకలవ్య వంగడమదేది?
వారసులుగారె మనకు నవ్వారలెల్ల
వెనుకబడినట్టిజాతీయ వీరవరులు

1950

(వెనుకబడిన జాతుల ఉద్యమ ప్రచారభాగం)

తీరని కోర్కెలు

వృత్తి సౌఖ్యమునకు వీలుగా నున్నట్టి
పరికరమ్ముల వారి పరముచేసి
విద్దియన్ వైద్యమున్ విజ్ఞానముంగూర్చి
వరల జేయంగల్గు వసతులొసగి
నివసింప గుడిసెల నిలబెట్టుకొనుటకు
కాళీస్థలమ్ముల గరుణజూపి
కులపు చాకిరియినాముల మాయచేయక
పట్టాలతో వాని గట్టిపరచి

భారతీయుల జాతీయ పర్వములను
సెలవు దినములుగాగ శాసించివేసి
మేలు గూర్పుడు మాకని జాలిగూర
వెనుక బడువారు వేడుట వినరెప్రభులు!

1951

(వెనుక బడిన జాతుల ఉద్యమ ప్రచార భాగం)

నిరుద్యోగి

తాత, ముత్తాతలు దాచి యుంచిన వెండి
బంగారములనెల్ల మ్రింగినాడు
అవ్వ, నాయనమ్మ లటకపై దాచిన
చిల్లరంగొని పాఱజిమ్మినాడు
పొట్టగట్టుక తండ్రి పొద్దస్తమానమ్ము
గూడబెట్టినదెల్ల గూల్చినాడు
చిఱుత ప్రాయమునుండి మరులుతో బెంచిన
అమ్మసొమ్ములు తెగనమ్మినాడు

ఇంతబెట్టినదీ విద్యగాంతు మంచు
చేయునదిలేక యేపని చేతగాక
చిత్త చాంచల్యమున వ్యర్థజీవియగుచుం
బొగలుచుండె నిరుద్యోగి పుంగవుండు.

1954

(వెనుకబడిన జాతుల ఉద్యమ ప్రచారభాగం)

అరుణ హస్తము

నిండుజాబిల్లి వెన్నెల పిండుచుండ
బండుకొన్నాడ నొంటిగ బాన్పుపైని;
కునుకుబట్టిన యంతలో గొట్టి తట్టి
లేపుచుండిన దెవ్వరో లేతబాల.

ఉలికిపడి లేచికూర్చుండి యూర్ధ్వముఖుడ
నయ్యుజూచితి నెవరని; వేయికనుల
నొక్కసారిగ జూడంగ నోపనట్టి
వెలుగు జిలుగులు నన్నెంతో కలతవెట్టే

సహజసౌందర్య సౌజన్య సాధుశీల
యందముల రాణి గుణమణి మందయాన
జాలి కన్నీటి కణములు జాలువాఱ
చూపుచున్నది అరుణహస్తంబుచాపి--

ఝరులు కలవెన్ని పంటకు జలము లేదు
పశువులున్నవి ప్రజలకు బాడిలేదు
కొండలున్నవి తలదాచ గొంపలేని
యట్టి సీమలు కనుల గన్పట్టు చుండె.

బుద్ధియున్నది జ్ఞానసమృద్ధి లేదు
సరుకులున్నవి కొనుగోలు శక్తిలేదు
తనువులున్నవి చలనమే కాన రాని

యట్టి జీవులు గన్పట్టుచుండే

సైన్యమున్నది తగిన శస్త్రములులేవు
తంత్ర మెంతయునుండె యంత్రములు లేవు
గత చరితయుండెగాని ప్రస్తుతములేని
ఝరులు కలవెన్నొ పంటకు జలము లేదు
పశువులున్నవి ప్రజలకు బాడిలేదు
కొండలున్నవి తలదాచ గొంపలేని
యట్టి సీమలు కనుల గన్పట్టు చుండె.
యట్టిభారతమాత గన్పట్టుచుండె

ఇంత రాతిరి నొంటిగా నిటకు వచ్చి
ఇన్ని దృశ్యాల జూపిన ఇంతిఎవరో?
శ్రద్ధతో పరికించగా జ్ఞప్తి వచ్చె
నిన్ననో? మొన్ననో? దారిలోనకలసి
పరిచయమ్మైన కవితాకుమారి ఆమె.

ఆలాపన

చల్లని సంధ్యవేళ బిగిచన్నులపై వలిపెంపు బైటకొం
గల్లదె జాజిపోవ గదలాడుచుం బ్రాకిన పూపుతీవెలం
దుల్లస రాగడోలికల నూగుచు మెల్లగ జేరద్రీయగల్
గల్లన నందియల్ తనరు కన్నియనాదరి చేరుటెన్నడో!

గల్లుగల్లనసాగె గాల్ల యందెల రవళులు
ఝల్లుమన్నది యుల్లము తెల్లవోయి

చేయునదిలేక దాపునం జేరలేక
కదలి కదలక కన్నార గాంచినాడ.

లేజిగురాకుబోణి-రవళించెడి యందెలరాణి - మల్లెలున్
జాజులు మాలగట్టి యొకసజ్జనమూర్తి నలంకరింపగా
బూజకుబోవుచుండ బ్రతిపూటయు గన్నులు పూయునట్టులా
రాజముఖిన్ గనుంగొనగ రాతుల నిద్దుర పట్టుటెట్టులో!

వే కువ అలుక

ఇంతుల మేలుబంతికి- మదించిన యౌవనరాశివీవు-నీ
గెంతులు, మంతనాలు, కనుగీటులు, పాటలు, నీటుగోటు లీ
వంతున నన్‌బిగించి, భయభక్తుల రక్తుల గల్గజేసె; నీ
పంతముమాని కావుమిక ప్రార్థితుడన్ భవదీయదాసుడన్.

నలినీ! నీదరిజేరి నానధర పానంబిచ్చి పోషింపవా!
కలికీ! గుబ్బలనాన్చి నాహృదయముం గామించి ప్రేమింపవా!
లలనా! ముద్దులుగుమ్మరించియు ననున్ లాలించి పాలింపవా!
నెలరాణీ! కరుణింపవా కమలపాణీ! నీల వేణీమణీ!

మెత్తని పట్టుపాన్పు-సుతిమెత్తని గు త్తిగులాబిమేను- నీ
మెత్తని మాటలున్, హృదయవీణిపై రవళించు పాటలున్,
ఒత్తుగనున్న నీల్‌కురులు, నుబ్బుకుచంబులు నబ్బురంబు; నా

చిత్తము మెత్తగిల్లె సరసీరుహనేత్ర! విలాసమున్ గనన్.

జాగదియేలనింక నెరజాణరొ! పిట్టలుకూడ మేతకై
సాగెను గూళ్లువీడి; కనుసన్నలలోని రహస్యమేదియో
లాగెనునన్నునీ రసవిలాసపుగేళికి, నింక నిచ్చమై
ఊగగ ప్రేమడోలికల నూహలు పొంగగ రమ్ము సుందరీ!

రాలెను మల్లెపూలు ప్రియురాల! కురుల్ సరిదిద్దుకొమ్ము! నీ
వాలు కనుంగవందెఱచి వానిని గూరుచుకొమ్ము! తూర్పునం
దేలుచునుండెప్రొద్దు, మదితీయని భావములూరె లెమ్ము! పూ
మాల నలంకరించుకొని మైమఱపింపగరమ్ము నెచ్చెలీ!

ముద్దుల మూటగట్టు నవమోహన ముగ్ధపరీమళాంగి! ఈ
అర్ధమరేయి నొంటిగ రహస్యముగా నినుజేరి గుండెపై
నద్దుకొనన్ మదీయ హృదయాబ్ధి తరంగిణియయ్యెదేవి! నీ
నిద్దపు ముద్దుమోవి పయినిండె శ్రమాంబువు లద్దనిమ్మికన్

"గుంటూరు పత్రిక" 7-7-1962

ద్వితీయ శ్రేణి

గేయములు

దీపములు
పుష్పాంజలి
ఆకటిమంటలు
స్వర్గధామం
అశనిపాతం
నవకవీ!
నాకలం
స్వర్ణసంక్రాంతి
పాపాయి
జో! జో!!
వర్షఋతువు
లే, కట్టునడుం!
వాడేమనీషి
స్వరాజ్య సౌధం
చిట్టిముచ్చట్లు
తేనెలూరేచిట్టి
వసంత విహారం
హితోపదేశం
సుప్రసన్నం

శ్రామికా!
నమస్కృతులు

పుష్పాంజలిచ

భాగ్యనగర నిలయా! సహృదయా!
మధురవాణి మృదుపాణీ
అనుపమ ప్రజ్ఞాధురీణ
అరుణారుణ కిరణాంచిత
కరుణామయి వరదాయీ ॥ భాగ్య॥

అమరావతి శ్రీశైలము
హంపీ తిరుపతికొండలు
సింహాచల మోరుగల్లు
దివ్యతీర్థముల విహారి ॥ భాగ్య॥

గోదావరి తుంగభద్ర
హంద్రీ కృష్ణా పెన్నా
నిర్మలకాసార నీర
ములను గ్రోలు పరమహంసి ॥ భాగ్య॥

నన్నయ తిక్కన పోతన
నాగార్జున కృష్ణరాయ

నాగమ రుద్రమ మొల్లల
ప్రసవించిన పూతచరిత ॥భాగ్య॥

"దేశభక్త" " ఆంధ్రరత్న"
"విశ్వదాత" వీరేశుల
అమరజీవి శ్రీరాముని
తృప్తికి మా సంతృప్తికి
పుష్పాంజలు లివేతల్లి! ॥భాగ్య॥

" గుంటూరుపత్రిక" 1957
(అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల సాంస్కృతికోత్సవముల
సందర్భమున రాయబడినది.)

ఆకటి మంటలు
మంటలు మంటలు
మండే మంటలు
చూడలేని గోడులుగా
జాడలేని జ్వాలలుగా
మింటకెగసి మండేవీ
మంటలు
మండే మంటలు.

తూకానికి త్రాసులేదు
కొలతకు పరిమితములేదు
ఇంతింతని చెప్పలేని

పెద్దది ఆ పరిమాణము
అందరికీ తెలియనివీ
కొందరికే తెలియునివీ.

అదియెండా ఇదివానని
మదినెంచక అదేపనిగ
గుదిగుచ్చిన కండలనూ
ముదిమిరంగు రుధిరమునూ
కదలించే - కుదిలించే
నరాధములు, కురూపులును
ఇంధనములు ఈ మంటకు.

ఒకప్రక్కన ప్రకటనలో
తుకతుక ఈ మంటలలో
ఉడికిపోయి ప్రాణములను
విడిచితిరని ఉదహరిస్తె-
వికటముగా సకిలిస్తూ
ఇంకింకా వేరెన్నో
సకారణము లుండంగా
చావులకీ సాకులు సరి
యైనవి కావని మనలకు
సమాధాన మిచ్చెదరీ
మంటల మ్రగ్గని శుంఠలు
స్వార్ధపరులు మరొకప్రక్క

ఉత్సవాల్మహోత్సవాల్ వ
నోత్సవాల్ రథోత్సవాలు
చేయాలీ చేతులతో
మనసుతోడ పనిలేదిక
అంతయునిది కృత్రిమమే
ప్రకృతికిది ప్రతికూలం.

ఉద్యమాల్మ హోద్యమాలు
భూదానపు టుద్యమాలు
పసమాలిన ఉద్యమాలు
రసహీనపు టుద్యమాలు
దీక్షారథ చక్రములకు
పగ్గములను పట్టికట్టి
పట్టుదలను గిట్టించే
పనికిమాలు నుద్యమాలు
విప్లవమున కురిబోసె
సంస్కరణల సడలించే
బ్రతుకుల భారముచేసే
గతిమాలిన ఉద్యమాలు.

కనుపింపని కందకాల
మండే ఆ మహామారి
ధాటికి తాళంగలేక
అఱచే ఆక్రందనముల

వినలేవీ వీనులగవ
కనలేవీ కనుల జంట

పూడదింక అగాధమ్ము
ఆరదింక విషజ్వాల
తీరవింక యమబాధలు
ఎప్పటికో చెప్పలేము.

"నగారా" 1-10-1953
"గుంటూరు పత్రిక" 1953
"వాసవి" 1953

(1952 లో ఇనుప గజ్జల తల్లి రాయల సీమలో విలయ తాండవం చేసినప్పుడు దినపత్రికలో వచ్చిన హృదయ విదారకమైన వార్తలు, ప్రకటనల నాధారంగా.)

## స్వర్గధామం

స్వర్గం సోమరులకు రాజ్యం
నరకం బహుఋషీ ప్రదేశం
భోగాలకు భాగ్యాలకు స్వర్గం
రోగాలకు నరకం నిలయం
ఉన్నోళ్లకు భూతలస్వర్గం
లేనోళ్ళకు భూతలనరకం.

కష్టం నష్టం నిష్ఠదరిద్రం
నెన్నుదుట పొటమరించే స్వేదం
భోగం భాగ్యం కుళ్ళినసౌఖ్యం
స్పష్టం గ్రాహ్యం పొట్టలదట్టం.

వాడి మాడి పొగలో సెగలో
కూడులేక బడిలో మడిలో

జాడలేని వ్యధలో సొదలో
నీడలేని గుడిలో గుడిసెలో
పడియున్నాడొక పవిత్ర హృదయుడు
కన్నుమూసె లోకంతో నేమని.

సోమరిపోతుల రాజ్యం పొమ్మని
కమ్మని కబుర్లుచెప్పే యముణ్ని
ప్రార్థిస్తున్నాడా దౌర్భాగ్యుడు
యమపురానికే తీసుకుపొమ్మని-

"నిష్టదరిద్రం నీనొసటన
నష్టజాతకమునే వ్రాసిన
బ్రహ్మన్న చెప్పినా ఒప్పను
ధర్మంతప్పక పాలిస్తా"
నని చెప్పే యమధర్మరాజు
పాదమ్ములపట్టెను పతితుడు.

నాలోకంలో మీబోంట్లకు
కాలూనను స్థానంలేదని
సమాధానం దబాయింపూ-.

"ఈలోకం చేరేవారలు
పూర్వజన్మ సుకృతంలో
కొండల బంగారందాచిన
కండలుపెంచిన మారాజులు
కడుపుకాలని స్వాములు- పరుల
కడుపులపై గొట్టిన  పెద్దలు
భూమిని పోషించిన  భోక్తలు
ప్రజలను  పాలించిన  సుజనులు
నరలోకమునందే  నాకం
చూచిన వారలకీ నరకం
అంతే..... అంతే...అంతే
లేదునీకు స్థానమ్మిచ్చుట
పో! సోమరిపోతుల రాజ్యం
నీకిటనుండే దక్షతపూజ్యం
ఆకంపు పూలతోటకు మార్గం
అదియే! చేరుకో స్వర్గధామం"

" వాసవి" 1-1-1953
"గుంటూరు పత్రిక " 24-1-1953
"నగారా" 1953

అశని పాతం
కసిగందిన వసివాడిన
పసిహృదయం పగిలిందని
పదేపదే అంతరాత్మ
ప్రబోధాలు చేస్తున్నది.

"లేదుసుమీ! కాదుకాదు"
ఎందులకో అంతలోనె
ఉత్సాహం ఊరడింపు
ఉబలాటం ఉబికివచ్చి
"జీవితమొక మావితోట
కాలము కొరకెదురుచూడు
చిగురించును సకాలములో
ఎందులకీ ఆరాటం
పోరాటం పనికిరాదు"

నిరీక్షించి నిరీక్షించి
సమీపించె సమయంబని
ఉవ్విళ్లూరిన మనసుకు

నిశ్చలత, నిరుత్సాహం
నివురుగప్పె నిప్పువంటి
జీవితముకు భావియేదో?

తొలకరించ పులకరించి
ప్రిదిలిందొక ఆశాలత
కాదుకాదది తటిల్లత
అంతలో అశనిపాతం.

" గుంటూరు పత్రిక " 4-7-1953

నవ కవీ!

పృథివి పాలించేటి
కదనరంగపు సూత్ర
ముంది నీచేతిలో....
పతిత జాతులుపడే
వ్యథల పరిమార్చగా
వదలుమో యువకవీ!

నిదురబోయే తరుణ
మిదికాదు అని తెల్పి
అదలించి పదిలముగ

జాతి నడిపించేటి
నీతివెల్గుల చిమ్ము
జ్యోతి నీచేతిలో
కదలుచున్నది కవీ!

నవ నవోజ్వల భావ
కవనంబు కలుగు నీ
కరము జర యెరుగదని
ఎరుగుదుము నవకవీ!

పారుబోతుల గూడ
ధీరులుగ చేసేటి
చేవవ్రాతల సిరా
ధారలుగ ప్రవహించు
విరిగిపోనిది నీదు
కరములోగల కలము.

అలిగి పలికావంటె
ములుకులై నీకలపు
వ్రాతలే కత్తులై
కోతకోయును కఠిన
హృదయమ్ము గలవారి

నీతినేర్పును వారి
నేతగా పనిచేసి.

"శ్రామిక సింహము" 1951

నా కలం

కరుళ్ళుగట్టిన మానవజాతిని
కరిగించుటకూ కదలించుటకూ
కదలించి ముందు కురికించుటకూ
ఉరికించి ప్రగతి సాధించుటకూ
కంకణమూనెను నాకలమూ.

సాంఘికార్థకపు చైతన్యమ్ములు లేక వ్యర్థులై
వెనుకబడుండిన
జాతులవారికి బోధలచేసియు
కార్యరంగమున దుమికించంగా
ప్రతిజ్ఞబూనెను నాకలమూ.

నిరక్షరాస్య పిశాచికి నిలువున
బలియై వెలియై యుండినవారికి

విజ్ఞానకుసుమ పరిమళమిచ్చెడి
వికాసోద్యమపు నిర్మాణమునకు
సంకల్పించెను నాకలమూ.

అజ్ఞానాంధకార నిశీథమున
మత్తునిద్రలో మెలకువలేకను
మేనుమరచి నిద్రించే అన్నల
వెన్నులతట్టీ కూర్చొనబెట్టగ
కోడికూతయగు నాకలమూ.

అంతేకా దింకెంతోయున్నది
నర రక్తమ్మును పరమాన్నంబుగ
కండల, ప్రేవుల పిండివంటలుగ
భక్షించేబాబుల వీనుగవకు
శంఖారావము నాకలమూ.

ఇంకా ఇంకా ఇంకా ఉన్నది
పేదలకన్నీరే పన్నీరుగ
వారల తీరని శ్రమలే మరలుగ

ఆక్రందనలే మరశబ్దములుగ
గద్గదస్వరమే నాదస్వరముగ
స్వేదధారనే సురాపానముగా
స్వీకరించు సోమరి సోమయలకు
సింహస్వప్నమౌ నా కలమూ.

నిర్దిష్టంగా ఒక్కమాటలో
సుస్పష్టంగా చెప్పాలంటే
నిచ్చెనమెట్టుల మనసంఘములో

ముందూ వెనుకల భేదము లేకను
మన పురుషులతో పాటుగ స్త్రీలకు
ధనికులతో పాటుగ నిర్ధనులకు
సర్వతంత్ర స్వతంత్ర భారతమున
సరిసమాన పౌరసత్వహక్కులు
సాధించక శాంతినాకులేదని
శపథముచేసెను నా కలమూ.

" రజక పత్రిక" 1-4-1950

స్వర్ణ సంక్రాంతి

వచ్చిన సంక్రాంతినేడు
తెచ్చిన సిరిసంపద మన
కిచ్చిన పుచ్చుక అంగన
లచ్చుట ముచ్చట నందిరి ।వచ్చిన।

చేమంతులు పూబంతులు
శ్రీమంతపు కొండంతలు
వాకిళ్ళను గొబ్బిమ్మలు
ఆకసమంటెడు శోభలు ।వచ్చిన।

చక్కగ చిక్కగ చెక్కిన
చుక్కలముగ్గుల అందం
బసవన్నల నుదుటపసుపు
నలదిన హృదయానందం ।వచ్చిన।

చెమ్మచెక్కలాటలాడి
కమ్మనైన పాటపాడి
బొమ్మల పెళ్లిళ్లచేసి
రమ్మా మనఅమ్మాయిలు ।వచ్చిన।

కుక్కుటముల పౌరుషమ్ము
లక్కట పెల్లుబికెనేమొ
శత్రువులను సాధించగ
సాహసించి పోరాడును ।వచ్చిన।

కూలివాళ్లు భూస్వాములు
కొలువుండిన పాలివాళ్లు
చవిచూచిరి తెనుగుతల్లి
స్తన్యమ్మును నేడొకటిగ ।వచ్చిన।

"గుంటూరు పత్రిక"1953
"తెలుగు దేశం 1953

పాపాయి
(జోలపాట)

బోసినవ్వులపూలు
కోసి కువ్వలు పోసి
కనుల విందుగ జేసె పాపాయి

తనువు ధన్యతనొందె నాకోయి.

లేగులాబీ చేతు
లేమొ పై కెత్తినను
ఎత్తుకొమ్మని దూకు పాపాయి
హృదయముప్పొంగెగా నాకోయి.

పనిపాట్లు చూచుకొని
పరుగు పరుగున వచ్చి
ఎత్తుకొని ముద్దిడగ పాపాయి
ప్రతి ముద్దునందించు నాకోయి.

అత్త, అమ్మా, నాన్న,
తాత, అక్కాయనుచు
నత్తిమాటలనాడె పాపాయి
కొత్త రుచులందించు నాకోయి.

బుజ్జి, చిన్నాయనుచు
పిల్వతననే యనుచు
కులుకుతూ తలద్రిప్పు పాపాయి
కలిగించు ముదమెంతో నాకోయి.

తప్పటడుగులువేసి

గప్పుమనిపడి, లేచి
చరచరా బందాడు పాపాయి
మురిపెమ్ము కలిగించు నాకోయి.

“ గుంటూరు పత్రిక ”29-4-1961

జో! జో!!
(జోలపాట)
భావిభారతవీర
నారీ మణులకెల్ల
నడినెత్తినాగరము జో! జో!!
మెడ రత్నహారమూ జో! జో!!

ఏడువకు నాతల్లి
ఎరుపెక్కు నీకనులు
అత్తవస్తున్నాది
ఎత్తుకొని లాలించ

చక్కనీ నాకన్న జో! జో!!
చల్లనీ నాచిన్న జో! జో!!
అందాలు చిందేటి
చందమా మల్లడుగొ

మబ్బుతెరమాటునా
దోబూచు లాడుటకు

నిను పిల్చుకొనిపోవు జో! జో!!
నిదురబో నాతల్లి జో! జో!!

మగువ మాంచాలలో
తెగువ నీలోకలిగి
మొల్ల కవయిత్రిలో
తెలుగు నీలోప్రబలి
ఊరూర పేరుతో జో! జో!!
నూరేళ్లు వర్ధిల్లు జో! జో!!

పండు వెన్నెలలోన
గండు కోయిలతోడి
పూలతోటలలోన
మల్లెబాలలతోడి
తీయగా పాడుకో జో! జో!!
హాయిగా ఆడుకో జో! జో!!

" గుంటూరు పత్రిక "1961

వర్షఋతువు

"రింఝుం" అంటూ చినుకులు
పృథివిని అలంకరించెను
మెరసెడి చిరుకాయములతో
కురిసెను సౌందర్యమ్మును.

గర్జించిన మేఘమ్ములు
వర్షించెను సంగీతము
అరుణారుణ సాయాహ్నము
నరులను మత్తెక్కించెను.

కదలలేని నదులు తిరిగి
సుందర జీవముపొందెను
చూడుము చిరుఅలలమీద చేసె
నటన సౌందర్యము.

వికసించెను వనములన్ని
పిలకలెత్తె మొలకలెన్నొ
పసుపువచ్చ లేతచిగురు
తెచ్చియిచ్చె ఆకుపచ్చ

చిరు మొగ్గలు తెరముసుగు
దీసి తొంగిచూచె నిపుడు
పృధివిని మృదుహాసముతో
పొంచిచూచె సౌందర్యము.

అనవరతము నాడిపాడి
బ్రతుకునుమధురంచేద్దాం
ఉన్న చిన్నగూటిలోనె
సుఖలోకము నిర్మిద్దాం.

(శ్రీనర్మదా ప్రసాద్‌ఖరేగారి, " వర్షబుతు" హిందీమూలమునకు స్వేచ్ఛావాదం.)

"గీతాజయంతి" 24-12-1963

## లే, కట్టునడుం!

స్వయంకృషిపై నిలుచునాతడు
ఎవరిదయకో చూచు టెందుకు?
పరులప్రేమను నమ్మి వారిని
ఎల్లవేళల పొగడుటెందుకు?
ఏలభయమున చావవలయును?
ఈ ప్రపంచపు రోడ్డునెక్కిన
ప్రతిమనిషి తనశక్తికొలదీ
పనిని చేసిననే తరించును.
లే, కట్టునడుం! భయమెందుకు?
ఆపైనచూడు దేవునికృప
వయసునంతా వృథాపుచ్చిన
వాడుచివరకు చింతచెందును;
కాళ్లుముడుచుకు కూరుచుంటే
కొంచమైనా లేదులాభము;
పాటుపడితే ఫలితముండును;
ఎంతవరకిటు వేచివుంటావ్?
మించిపోవును మంచితరుణము.

లేలే, కట్టునడుం! భయమెందుకు?
ఆపైనచూడు దేవునికృప.
ఉన్నసమయం వృథాచేసిన
వాడుచివరకు దు:ఖ మొందును;
నిద్రపోయిన వానిచెంతను
రోదనేమిగిలుండు చివరకు;

విత్తినాతడె కర్తపంటకు;
ఎంతవరకిటు లజాగ్రత్తగ
నిద్రపోతా వొళ్లతెలియక
జరుగ వలసిన దేదొజరుగును.

లే, కట్టునడుం! భయమెందుకు?
ఆపైనచూడు దేవునికృప

(శ్రీ జనాబ్ దీవానాగారి ''ఉఠ్, బాంధ్కమర్ '' '' హిందీ మాతృకకు
స్వేచ్ఛానువాదం)

వాడే మనీషి
మనీషియన పరికించిన
చావన భయపడని వాడె;
మంచిచావు చావు నిన్ను
పదుగురు పదికాలములు
జ్ఞప్తియుంచు కొను నట్టుల.

పశుప్రవృత్తియన అర్థం
తనకు తానుగా మేయుట;
మనీషి అంటె అతడే
తన ప్రాణం పరులకొరకు
తృణముగ నిచ్చేవాడే

అనాథు డెవుడున్నాడిట?
దీనబంధు దయాళువును
సత్యరూపి ఈశ్వరునకు
ఉన్నది సరిహద్దులేని
పెద్దదైన సహృదయము
నిస్పృహ భావావేశులు
భాగ్యహీనులత్యధికులు;

మనీషి అంటే
తనప్రాణము పరులకొరకు
తృణముగ నిచ్చేవాడే.

నడు నచ్చినమార్గములో
సంతసముగ గంతులిడుచు;
అడ్డంకుల కష్టములను
అధిగమించు హుంకరించి

ఏకత్వము  చెదరకుండ

లేకుండా భిన్నత్వము
ఒకమాటను- ఒకబాటన
ఇకకదలుడు పాంధులరై.

అతిసమర్ధ చర్యఇదే
తనివితీర తాన్తరించి
తరింపంగజేయు పరుల;

మనీషి అంటే  అతడే
తనప్రాణము పరులకొరకు
తృణముగ నిచ్చేవాడే.

మైధిలీ శరణ్‌గుప్తగారి  "వహీమనుష్య హై"
హిందిమూలమునకు  స్వేఛ్ఛానువాదం
26-1-1964

స్వరాజ్య సౌధం

విలువగలిగినా విప్లవమూర్తుల
విరిగిన యెముకల ఇటుకలపేర్చి,
కారిన రక్తపు సున్నముచేర్చి,
నిర్మించారీ స్వరాజ్యసౌధము

గుచ్చిన వీరులమాంసపు కండలు
ఆ సౌధానికి పూవులదండలు;

జీర్ణములై జీరాడిన పేవులు,
స్వర్ణసౌధముకు  తోరణమాలలు.

సత్య మహింసలు, శాంతిధర్మములు
నిత్యవ్రతమ్ములు నిక్కపుసొమ్ములు;
నిరాడంబరత, నిస్వార్థమ్ములు
సత్క్రమవర్తన చక్కటిబాటలు.

శౌర్యధైర్యములు, సాహసకృత్యాల్
కార్యసాధనలు కట్టనిగోడలు;
పరువు ప్రతిష్ఠలు, కీర్తియశస్సులు
స్వరాజ్యసౌధపు సుస్థిరజ్యోతులు
"గుంటూరు పత్రిక" 15-8-1953

చిట్టిముచ్చట్లు
(చిట్టి పాటలు)

ఏమనీచెప్పేది చిట్టిముచ్చట్లు
ఎన్ననీచెప్పేది చిన్నముచ్చట్లు?

కమ్మకమ్మని వంటకమ్ములెన్నో పళ్లె
రమ్ము లోనుంచినను రమ్మనీపిలిచేది
ఏమనీ చెప్పేది చిట్టిముచ్చట్లు
ఎన్న నీ చెప్పేది చిన్నముచ్చట్లు?

నిదురలో నాచిట్టి పదములెన్నో పాడి
కథలనెన్నో చెప్పి నీతులను నేర్పేది
ఏమనీచెప్పేది చిట్టిముచ్చట్లు
ఏన్నని‌చెప్పేది చిన్నముచ్చట్లు?

కలలోన నాచిట్టి తలలోనిపూవుల్లు
కిలకిలా నవ్వుచును పలుకరించేవినను
ఏమనీచెప్పేది చిట్టిముచ్చట్లు
ఎన్ననీచెప్పేది చిన్నముచ్చట్లు?

"మంచి" అనియెడు తోటపెంచుకోమనియేది
"ప్రేమ" అనియెడు పూవుత్రుంచుకోమని యేది
ఏమనీచెప్పేది చిట్టిముచ్చట్లు
ఎన్ననీచెప్పేది చిన్నముచ్చట్లు?

చదువుకుంటే హృదయసంస్కార ముండాలి
సంస్కారమేలేని చదువు వృథయంటాది
ఏమనీచెప్పేది చిట్టిముచ్చట్లు
ఎన్ననీచెప్పేది చిన్నముచ్చట్లు?

కాంతసమ్మితమైన కవితరావాలంట
కవితలోప్రగతి ప్రభవించాల యంటాది
ఏమనీచెప్పేది చిట్టిముచ్చట్లు
ఎన్ననీచెప్పేది చిన్నముచ్చట్లు?

" గుంటూరు పత్రిక " 16-3-1953

తేనేలూరే చిట్టి
(చిట్టి పాటలు)

చిట్టివంటిపిల్ల లేదోయి లేదోయి!
తేనెలూరేచిన్న రాదోయి రాదోయి!

కనులలో వజ్రాల
గనులుమెరిసే సొగసు
పలుకులో ముత్యాలు
జాలువా రే వయసు

చిట్టివంటిపిల్ల లేదోయి తేదుయి!
తెనెలూ రేచిన్న రాదోయి రాదోయి

ఆటలాడే చిట్టి
పాటపాడేచిన్న
మాటలే బంగారు
మూటలై - రతనాల

కోటలై జీవితపు
బాటలై నిలచాయి
చిట్టివంటిపిల్ల లేదోయి లేదోయి!
తేనెలూరేచిన్న రాదోయి రాదోయి!

మందార మకరంద
మాధుర్యమునదేలు
మధుపమ్మునై చిట్టి
వదనమ్ముపై వ్రాలి
అందాలుచిందు - ఆ
నందాలుపొంగు - ఆ
కందళిత హృదయార విందమ్ము చవిచూతు
చిట్టివంటిపిల్ల లేదోయి లేదోయి!
తేనేలూరేచిన్న రాదోయి రాదోయి!

" గుంటూరు పత్రిక " 24-4-1957

వసంత విహారం
(చిట్టిపాటలు)
హాయిగ తీయగ పాడిన
కోయిలమ్మ కలకంఠం,
ఝుమ్మని ఝుమ్మని రేగిన
మధుపమ్ములసంగీతం,
గిరిశిఖరమ్ముల నటించు
సెలయేరుల చిరునాదం,

పూవుల తీవెలుసాగిన
వసంతఋతువైభోగం,
తెల్లని చల్లని పున్నమ

వెన్నల కన్నియగానం,
అల్లన మెల్లన వీచిన
మలయానిల మృదుహాసం,
తేనెల సోనలు స్రవించు
చిన్న చిట్టి దరహాసం,

తిలకించుచు పులకించగ
తీయనికోరిక లూరగ
ఈ ప్రశాంత వసంతాల
పూవనాల సుపవనాల
ఈలతాంత పరిమళాల
మృదులహాస వినోదాల
విహరింతును నా చిట్టితో.
"గుంటూరు పత్రిక" 25-5-1957

హితోపదేశం
(చిట్టిపాటలు)
" కోటిగొంతుల మీటి కిన్నెర
కోటిగొంతుల కొట్టికంజర"
పాటపాడెడి చిట్టినాతో
పాటు వుంటానన్నదీ... ॥కోటి॥

మావి చివురులు మేసికూసెడి
మత్త కోయిల మధురగీతం
తోటలో గల మేడగదిలో

నుండి విందామన్నదీ..... ॥కోటి॥

పేదసాదుల వేడినెత్తురు
గతుకు పెద్దల మతినిమార్చే
విధముకనుగొని దేశప్రజలకు
హితవు కూర్చాలంటదీ.... ॥కోటి॥

బుద్ధదేవుని పుణ్యభూమిలో
పుట్టిపెరిగిన యట్టిమనుజులు
తోటివారిని సహజ ప్రేమతో
ఆదరించాలంటదీ... ॥కోటి॥

"గుంటూరు పత్రిక" 29-6-1957

సుప్రసన్నం
( చిట్టిపాటలు)

గలగల నడయాడు హంసి
నాట్యమాడు మయూరం
కిలకిలకూసెడి కోయిల
పలుకులు చిలుకుప్రభాతం,
జలజల ప్రవహించెడు ఝరి
మృదుమధురిమల మృదంగం,
సలసల పొంగెడు పరువపు
పువ్వులలో మకరందం,

దేహపు గేహపు దేశపు
క్షేమము లక్ష్యముగాగల
భారత వీరకుమారులు
ప్రభవించెడు సుక్షేత్రం
నునుబుగ్గల నాదుచిట్టి
కనుదామరలందున సిరి
చదువులందున సరస్వతి
ప్రసన్న వదనా పార్వతి.

" గుంటూరు పత్రిక 24-8-1957

శ్రామికా!

ఓ వీర శ్రామికా!

ఓ వీర సేవికా!

విజ్ఞానజ్యోతి వెలిగించాలోయ్!
అజ్ఞాన చీకటెడబాపాలోయ్!
విద్య, విజ్ఞాన ప్రభావగరిమంబరసి
దేశస్వాతంత్ర్య భాగస్వామినే యనుచు
చాటిచెప్పుచు ముందు నడవాలోయ్
నీచభావమును తొలగించాలోయ్ ॥ఓ వీర॥

బొక్కసంబులలోని రొక్కబలమునుచూచి
ఉక్కు పాదాలతో నొక్కుచుండెడివారి
పీచమణచగనీవు పూనాలోయ్!
తక్కువన్నతలంపు తొలగాలోయ్! ॥ఓవీర॥

తీయతీయని తేటమాటలతోమననెల్ల
లాలించి పాలించ "వోట్లు" గైకొనువారి
మోసంబు పసిగట్టి మెలగాలోయ్
గద్దెనెక్కగ యత్నమూనాలోయ్ ॥ఓవీర॥

"శ్రామికసింహము" నుండి 1951

నమస్కృతులు
సయస్కృతులు నరసింహారావ్!
మిత్రుండవొ? బంధుండవొ?
సద్యోహిత సంధుండవో?
కరుణారస సింధుండవొ?
అధికారివొ? ఆప్తుండవొ?
ఏదొ? తెలియని సన్నిహితం.
అందరితో నొకేలాగు
మంతనాల నాడేనీ
సాదాసీదా తత్వం
మంత్ర ముగ్ధులను చేయును,
మమతను, మా మానవతను
పెంచును అహమునుడించును
నమస్కృతులు నరసింహారావ్!
చూచి చలన చిత్రాలను
గీతా, ఖురాను, బైబులు,
నవల చదివి ఇతిహాసం,
మాడ్లాడిన మనుషినుండి

గడచిన ప్రపంచ చరిత్ర
సాదోహరణంగానూ

హృద్యంగమంగా కూడ
చెప్పుచుండు ధీశాలివి.
సమస్కృతులు నరసింహారావ్!

"అధికారి" యన, పెత్తందారికాదు
బాధ్యతనెఱిగిన ఉత్తమ సేవకుడు"
"ప్రభుత్వముకు, మన ప్రజలకు
"లాభము చేయుట" అంటే
"కంట్రాక్టర్ని కేవలంనష్టపెట్టటమా? కాదు
ఉద్దేశించిన మేరకు
శ్రద్ధగా పనిజరగటం,
అమూల్యమగు కాలమునకు
సరిమూల్యం జమకట్టుట"
దేనిపైన ఎవరికెంత
"పవరు"ందని ప్రశ్నిస్తే--
"విచక్షణా, చి త్తశుద్ధి
లోపించకుండ ఉంటే,
పైవానికి "పవ" రెంతో
క్రిందివాని "పవ" రంతే"
అని సమర్థించి చెబుతావ్.
నమస్కృతులు నరసింహారావ్.

లోకానుభవం పట్టాకన్నా
ఇంగితజ్ఞానం చట్టంకన్నా
మిన్నని  వాదన చేస్తావ్
ఆచరణలో చూపిస్తావ్
" జీవితం చిక్కులమయం,
బ్రతుకు భార ' మని అంటే "సహృదయంతో పనిచేస్తే
ఉన్నదానితో తృప్తిచెంది
జీవితమెంతో సాఫీ
బ్రతుకుట చాలా తేలిక"
అని చెప్పి మెప్పించుతావ్
నమస్కృతులు నరసింహారావ్!

నీ మార్గం గాంధేయం
సమతాలోకం ధ్యేయం
అదేమాకు  ఆదర్శం
అందుకే ఈ నమస్కృతులు
అందుకో నరసింహారావ్!

(జీవితగమనానికి ముళ్లులేనిబాట చూపిన  ఒంగోలు రహదారి
భవనములశాఖ ఎగ్జిక్యూటివ్ శ్రీ పి. నరసింహరావు నాయుడు గారిని
ఉద్దేశించి ఈ గేయం)

26-1-1963